# నామమాత్రంగా అమలవుతున్న యస్.సి., యస్.టి అత్యాచార నిరోధక చట్టాన్ని మరింత నీరుగారుస్తున్న సుప్రీంకోర్టు తాజాతీర్పు

**షెడ్యూలు** కులాల, తెగల అత్యాచార నిరోధక చట్టాన్ని నీరుగార్చేవిధంగా కీలకమైన సవరణలు చేస్తూ 20-3-2018న సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పు దేశంమొత్తంగా తీవ్ర అలజడిని రేకెత్తించింది. సుప్రీంకోర్టు తీసుకొన్న వైఖరి, ఈ తీర్పుకి దారితీసేలా కేంద్రప్రభుత్వ వాదనలు, నివేదికలు దళిత, ప్రజాతంత్రశక్తుల న్యాయమైన ఆకాంక్షలకు సూటిగా వ్యతిరేకమైనవి, గర్హించాల్సినవి. ఈ తీర్పు అనంతరం 2-4- 2018న భారత బంద్‌కు పిలుపు ఇచ్చిన ఆందోళనకారులపై మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్‌లలో పోలీసులు కాల్పులు జరిపి 11 మందిని చంపడ మన్నది, ఆయా ప్రభుత్వాలు చేసిన దుర్మార్గం. తీవ్రంగా ఖండించాల్సిన విషయాలు ఇవి.

**యస్.సి., యస్.టి. అత్యాచార నిరోధక చట్టం-నేపథ్యం-అమలు:**

1985 జులై 17 కారంచేడు దళిత నరమేధం తరువాత దేశవ్యాపితంగా దళితులపై జరుగుతున్న దాడులపై ఒక తీవ్ర ఆందోళన జరిగింది. దీని ఫలితంగా 1989లో కేంద్ర ప్రభుత్వం యస్‌సి, యస్‌టి అత్యాచార నిరోధక చట్టాన్ని తెచ్చింది. 1995 నుంచి చట్టం అమలులోకి వచ్చింది. చట్టం అమలులోకి వచ్చిన ఈ 23 సంవత్సరాలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ చట్టాన్ని చిత్తశుద్ధిగా అమలు చేయలేదు. కేసుల నమోదు నుంచి విచారణ వరకూ అధికార యంత్రాంగం పాలకశక్తులు, భూస్వామ్య, అగ్రకుల దురహంకారులకు, పెత్తందార్లకు వ్యతిరేకంగా ఒక శక్తివంతమైన సాధనంగా ఈ చట్టం మారకుండా అడ్డు పడుతూనే వచ్చింది. ఇటీవల కాలంలో ఆ చట్టం ప్రాతిపదికన ఇవ్వబడిన ట్రయల్ కోర్టుల తీర్పులను హైకోర్టులు తిరగతోడటం ప్రారంభమైంది. చుండూరు కేసులో ట్రయిల్ కోర్టు ఇచ్చిన తీర్పును కొట్టివేస్తూ దోషులను నిర్దోషులుగా ప్రకటిస్తూ హైకోర్టు తీర్పునిచ్చింది. తూర్పు గోదావరిలో వెంకటాయపాలెం దళితుల శిరోముండనం కేసు 20 సంవత్సరాలు అయినా ట్రయిల్‌కోర్టులో విచారణ జరుగతూనే వుంది. నిందితులను రక్షించడానికి ప్రభుత్వం, రెవెన్యూ అధికారులు-బాధితులు అసలు దళితులు కాదు, క్రైస్తవులని తప్పుడు నివేదికలు ఇస్తున్నారు. వేరే వారి సమాధుల వెనక బాధితుని తల్లి పేరు రాసి క్రైస్తవ మత చిహ్నాలు చెక్కి అందువల్ల వీరు దళితులు కాదని బుకాయిస్తున్నారు. లక్ష్మింపేట హత్యాకాండ కేసు ఇప్పట్లో ఒక కొలిక్కివచ్చే సూచనలు లేవు. సాక్షులను బలహీన పరచడానికి ఈ ఆలస్యం వాడుకోబడుతున్నది. వాకపల్లి అత్యాచార ఘటన ఇంకా కోర్టు చుట్టూ తిరుగుతూనే వుంది. బీహార్‌లోని లక్ష్మణపూర్ బాతే, బటానీటోలా వంటి పెద్ద నరమేధాలు జరిగిన ఆరు కేసులలో ట్రయిల్ కోర్టు తీర్పులను కొట్టివేస్తూ ఆ రాష్ట్ర హైకోర్టు నిర్దోషులుగా ప్రకటించింది. చాలా న్యాయ స్థానాలలో యస్.సి. యస్.టి. కేసు అంటే న్యాయమూర్తులు అసహనంతో తిరస్కరించే ఒక సామాజిక వాతావరణం కల్పించబడింది. దీనికి సాకుగా పాలకశక్తులే తమ ప్రత్యర్థులపై తమ అనుచరులచేత పెట్టించిన తప్పుడు యస్.సి., యస్.టి. కేసుల్నే చూపుతున్నారు. ఫలితంగా యస్.సి. యస్.టి. కేసులలో 3 శాతం కేసులలో కూడా అసలు అగ్రకుల దురహంకారులకు శిక్షలు పడటం లేదని సర్వేలు తెలియచేస్తున్నాయి. మరోపక్క ఈ కాలంఅంతా దళితులపై, యస్‌టిలపై అత్యాచార పర్వం కొనసాగుతూనే వుంది. ఈ తీర్పు వెలువడుతున్న కాలంలోనే ఇటీవలే గుజరాత్ రాష్ట్రంలో ఉనాలో గుర్రంమీద తిరుగు తున్నందుకు ఒక దళిత యువకుడిని క్షత్రియ అగ్రకులాలవారు సజీవ దహనం చేశారు.

**ప్రస్తుత సుప్రీంకోర్టు తీర్పు-దాని క్రమం:**

సుభాష్ కాశీనాథ్ మహాజన్ వర్సెస్ మహారాష్ట్ర ప్రభుత్వం కేసులో జస్టిస్ ఏ.కె.గోయల్ నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం తీర్పు చెపుతూ యస్.సి. యస్.టి. అత్యాచార నిరోధక చట్టం “అమాయకులను” బ్లాక్‌మెయిల్ చేసేందుకు ఉపయోగించుతున్నారని కనుక చట్టంలోని కేసునమోదు క్రమంలోనే ప్రభుత్వాధికారులైతే ఉన్నతాధికారులనుంచి అనుమతి పొందాలని, ప్రైవేటు వ్యక్తులైతే సీనియర్ పోలీసు సూపరింటెండెంట్ పరిశీలించి నిర్ధారించాకే కేసు నమోదు చేయాలని, వెంటనే జ్యుడిషియల్ కస్టడీకి పంపాలన్నది చెల్లదని తీర్పు ఇచ్చింది. ఆచరణలో దళిత, ప్రజాతంత్రవాదుల అనుభవంలో ఏదైతే ఈ చట్టాన్ని బలహీనపర్చి నీరుగార్చుతున్నదో దానికి ఇపుడు సుప్రీంకోర్టు న్యాయపర ఆమోదముద్రను వేసిందని గమనించాలి. దీని తర్వాత జరిగిన ఆందోళనల తరువాత కేంద్రం వేసిన రివ్యూ పిటీషన్‌పై స్పందిస్తూ సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఏ.కె. గోయల్ ‘2015లో కేంద్రం ఇచ్చిన నివేదికలు, వాదనలను బట్టి తీర్పు ఇచ్చాం’ అన్నారు. కేంద్రప్రభుత్వం సామాజిక న్యాయం, సాధికారతలపై స్టాండింగ్ కమిటి ఇచ్చిన 6వ నివేదికను సుప్రీంకోర్టుకి సమర్పిస్తూ యస్.సి., యస్.టి. చట్టం దుర్వినియోగం అవుతున్నదని చెప్పింది. సొలిసిటర్ జనరల్ మణిందర్‌సింగ్ తన అఫిడవిట్‌లో చట్టం దుర్వినియోగం అవుతున్నదని చెప్పినట్లు ఈ కేసులో అమికస్‌క్యూరీగా వ్యవహరించిన అమరేంద్ర షరాన్ చెప్పినట్లు పత్రికలు రాశాయి. చట్టం లోని సెక్షన్ 18ను సవరించి ముందస్తు బెయిలు కూడా ఇవ్వాలని సొలిసిటర్ జనరల్ కోరిన విషయాన్ని తీర్పులో పేర్కొన్నది. సుప్రీంకోర్టుకి కేంద్రం 2015లో ఇచ్చిన నివేదికలో 16 శాతం కేసులను పోలీసులు మూసివేసారని, పెట్టిన కేసులలో 75శాతం కేసులలో వ్యతిరేక తీర్పులు రావడంతో

ఉపసంహరించుకొన్నట్లు తద్వారా చట్టం ఎలా దుర్వినియోగం అవుతుందో తెలియజేస్తూ ఆ నివేదికను సమర్పించింది. ఈ తీర్పు వెలువడిన వెంటనే యు.పి.కి చెందిన క్యాబినెట్ మంత్రి ఓంప్రకాష్ రాజ్‌బహర్ తీర్పును స్వాగతిస్తూ "అమాయకులను" బ్లాక్‌మెయిల్ చేసేవిధంగా ఉన్న ఈ చట్టం "వరకట్న నిరోధక చట్టం" లాగానే "దుర్వినియోగం" అవుతున్నదని పేర్కొన్నారు.

**ఈ కోర్టు తీర్పులను ఎలా చూడాలి?**

దేశవ్యాపితంగా దళిత, ఆదివాసులపై అత్యాచారాలు నిరాఘాటంగా సాగుతున్న నేటి కాలంలో అసలు ఈ చట్టాలు అమలుకావడమే ఒక సమస్యగా వున్న సామాజిక వాతావరణంలో "దుర్వినియోగం" "బ్లాక్‌మెయిల్" అనే పదాల మాటున చట్టాల అమలును నీరుగార్చే చర్యలను కోర్టులు ఎందకు తీసుకొంటున్నాయి? కేంద్రం ఏం చెపితే దాన్ని ఆమోదించాలా? ఘోరమైన దళిత, గిరిజన నరమేధపు కేసులలో ట్రయిల్ కోర్టులు వేసిన శిక్షలను హైకోర్టులు కొట్టివేసి దోషులందర్నీ ఎందుకు విడుదల చేస్తున్నాయి? దీనికి సమాధానం సుప్రీంకోర్టు సీనియర్ జడ్జిగా పనిచేసిన జస్టిస్ ఓ.చిన్నపరెడ్డి రచనలలో చూద్దాం. **"పాలకవర్గాలనే మాటను నేను ప్రస్తావించినపుడల్లా బ్యూరోక్రటిక్ ప్రభుత్వాలు అనే అర్థంలో చూడవద్దని నా మనవి. చట్టాల లోనూ, చట్టాల ద్వారాను, బ్యూరోక్రసి వల్లనూ, బ్యూరోక్రసి ద్వారానూ, న్యాయస్థానాలలోనూ, న్యాయస్థానాల ద్వారానూ పాలకవర్గాలు ప్రవర్తిస్తాయి. శాసనకర్తలు, బ్యూరోక్రాట్లు, జడ్జీలు – వీరందరూ బూర్జువా పాలకవర్గాల తరగతికే చెందినవారు" అని అంటూ ఆయన ఇంకా ఇలా అన్నారు. "న్యాయవ్యవస్థన్నది సామాజిక జీవనానికి పునాది వంటిదని దాని సూత్రాలు సర్వసమర్థ నీయమైనవీ, ఈ లోకంలో అత్యంత న్యాయ బద్ధమైన ధర్మ రాజ్యాన్ని నెలకొల్పగలవేననీ వాళ్ళు ప్రకటించుకొంటూ వుంటారు. కానీ అనివార్యమైన వర్గవైరుధ్యాలు పదునెక్కినపుడు వ్యవస్థ స్వరూపం బట్టబయలు అవుతుంది. కనుక, వాళ్ళు తమ న్యాయాన్ని తామే అతిక్రమిస్తారు. తాము నిర్మించిన వ్యవస్థపై తామే తిరుగుబాటు చేసి, తమకు భారంగా మారిన తమ న్యాయవిధానాన్ని, నియమాలను స్వయంగా రద్దుచేస్తారు. కొన్నిసార్లు వాళ్ళు ప్రదర్శించే అసహనాన్నీ, ఆగ్రహాన్ని బట్టి ఈ వ్యవస్థలో ఏర్పడిన అంతర్గత ఘర్షణను అంచనా వేయవచ్చు. ("న్యాయసిద్ధాంత నిపుణులు జస్టిస్ ఓ. చిన్నపరెడ్డి వ్యాసాలు–ఉపన్యాసాలు" పేజీ 103)**

కనుక న్యాయవ్యవస్థ అన్నది ఈ రాజ్యాంగ యంత్రంలో అంతర్భాగం. నేడు అణచబడిన వర్గాలు, సమూహాలు దోపిడీ, పీడనలకు వ్యతిరేకంగా రకరకాల స్థాయిలలో ఆందోళనలలో కదలబారు తున్నారు. ఈ ఆందోళనలన్నీ ఒక మహోజ్వల పోరాటరూపం తీసుకోకముందే ప్రజల ఆందోళనల ఫలితంగా వచ్చిన చట్టాలన్నింటినీ పాలకవర్గాలు క్రమంగా రద్దుచేయబూనుకొంటున్నాయి. వీటికి గల చట్టబద్ధతను కాగితాలమీద నుండి కూడా తొలగించదలచుకొన్నాయి. అణచబడిన సమూహా లపై పీడక వర్గాల వ్యూహాత్మక దాడిలో ఒక అంశమే, ప్రజాఉద్యమాల ఫలితంగా ఉనికిలోకి వచ్చిన చట్టాల రద్దు. కనుక ఈ రాజ్యాంగ యంత్రంమీద భ్రమలు వీడాలనీ, అన్ని అణచి వేతలకు వ్యతిరేకంగా పీడిత ప్రజలు సంఘటితం కావాలని ప్రభుత్వాల పోకడలు తెలియ జేస్తున్నాయి. యస్.సి. యస్.టి. అత్యాచార నిరోధక చట్టంను బలహీనపరిచే అన్ని చర్యలను మానుకోవాలని ప్రజాతంత్ర ఉద్యమ అండతో పోరాడాలి. సంఘటితంగా వుండటం, వర్గ ఉద్యమాలలో పురోగమించడంద్వారానే దళిత, పీడిత ప్రజలకు నిజమైన రక్షణ సాధ్యం అని గుర్తించాలి.

oooo